మంచమీదినుంచి లేచాడు. గబగబా పార్వతిని వెతుకుతూ లోపలకు వెళ్ళాడు. పార్వతి చాప మీద కూర్చుని నాన్నగారి పాంతరికార్డులు తిరగేస్తున్నది.

"మీ నాన్నగారియిల్లు - ఒకరికి తెలీకుండా మరొకరికి ముగ్గురి తాకట్టులో వున్నది."

పార్వతి బావవంక చూసింది.

"ఎవరన్నారు?"

"ఎవరో ఎందుకంటారు? ఆ ముగ్గురూ నాకు తాకట్టు దస్తావేజులు చూపించారు."

"నేను నమ్మను."

"నేను నమ్మాను."

"అయితే నన్నేం చెయ్యమంటారు?"

"ఇక్కడుండటానికి వీల్లేదు. ఇక్కడుండి చెయ్యగలిగిందీ ఏమీలేదు. నాతోపాటు మా యింటికి రావాలి. అదీ నీ సొంతయిల్లే."

పార్వతి వెక్కివెక్కి ఏడ్చింది.

"బావా! నీ పెళ్ళికి తెగిపోయిన పూలదండలు కట్టినదాన్ని. నన్ను ఆహ్వానిస్తున్నావా?"

పాము కాటువలె యీ పూలదండమాటకు వివేక్ ఒక్క అడుగు వెనుకకు వెళ్ళాడు. అతని కళ్ళు చీకట్లుకమ్మినవి. మెదడు అర్థం గమ్యంలేని అరాచకవేగంతో పరుగులుతీసింది. ఆనాటి పూలదండ నాగుబామువలె పడగలెత్తి అతని కళ్ళముందు ఫణంవిప్పి ఆడసాగింది. నాగస్వరం వూదుతున్న పాములవాడివలె పార్వతి కూర్చునివున్నది. అతడు యీ భ్రమనుండి బయటపడేసరికి ఎంతకాలమైందో వూహించలేదు.

"నీ బట్టలన్నీ మీ అక్క సర్దుతున్నది. ఇవ్వాళ సాయంత్రమే మన ప్రయాణం" అని వివేక్ అక్కడి నుండి కదిలిపోయాడు.

(ఇంకా వుంది)

---

స్కెచ్

# దేవుడిచ్చిన వరం

దుత్తా దుర్గాప్రసాద్

మూడేళ్ళనుండి వర్షాల్లేక పంటలు పండటం లేదు. నీటిబొట్టుకి మొహం వాచిపోయున్నారు జనం. ఊళ్ళో ఎక్కడచూచినా దారిద్ర్యం తాండవిస్తోంది. దొంగతనాలూ, దౌర్జన్యాలూ పెరిగిపోతున్నాయి. గుప్పిట్లో ప్రాణాలన్నీ పెట్టుకు బ్రతుకుతున్నారు ప్రజలు.

ఏడాది సవ్యంగా వర్షం పడింది. నిరాశానిస్పృహల్లో మునిగిఉన్న రైతులంతా ఒక్కసారిగా, హుషారుగా నవ్వారు. అంబలైనా దొరకక, అంటుకుపోయిన డొక్కల్తో పడివున్న కూలీలు ఒక్కసారిగా ఒళ్ళు విరుచుకొన్నారు. ఊళ్ళో ఎక్కడచూచినా ఆనందం అలముకుపోయి ఉంది. అణగారిన ఆశలన్నీ మేల్కొనడంతో దేవుడిమీద అపారమైన భక్తి ఏర్పడిపోతోంది ప్రజల్లో.

అలాంటి వారణంలో—అంటే సరిగ్గా ఇరవై సంవత్సరాలక్రితం, ఐనాపురంలో ఒకనాటి సాయంకాలం, మసకమసకగా ఉంది, ఇంకా చీకటి పడలేదు. అప్పయ్యనాయుడిగారి అరుగుమీద నాయుడుగారూ, ఆచార్యులుగారూ, రంగయ్యశెట్టీ, ఏదో మాట్లాడుకొంటూండగా, నాయుడిగారి పాలేరు వెంకడు, యింటిముందు గడ్డి బండి తీసుకొచ్చి ఆపాడు. నలుగురూకలిసి బండిమీది గడ్డి తొలిగించి ఓ పెద్దమూట కష్టంతోదించి, లోపలికి మోసుకెళ్ళారు. ఇదంతా చింతచెట్టుమీద కోతీ కొమ్మచ్చి ఆడుకొంటున్న నలుగురు కుర్రాళ్ళు చూచారు. వాళ్ళకేదో తమాషాగా తోచింది కాబోలు. నలుగురూ వచ్చి నాయుడిగారి వాకిట్లో నిలబడి లోపలకి తొంగిచూస్తుంటారు. ఇంతలో రంగయ్యశెట్టి బయటికొస్తూ వీళ్ళనిచూసి గాభరాగా "ఎందుకబ్బాయ్, ఇక్కడ నించున్నారూ? ఎంతసేపైంది మీరొచ్చి?" అని